# మర్కటం

''ఏరా! నువ్విలా పెళ్లి పెటాకులు లేకుండా మైలురాయిలా వుండి పోతావా?"

చలం మాట్లాడలేదు. నవ్వాడు సమాధానంగా!

"మీరిలా వచ్చినప్పుడల్లా అడుగుతూ వుండండి. ఆయన ఆలా చిద్విలాసంగా నవ్వివూరుకుంటాడు!" రుక్మిణి చిరుకోపంతో, అంది.

భవానీప్రసాదు, సిగరెట్ చలానికోటిచ్చి, తనోటిముట్టించుకొని, "మేమలావెళ్లి; పెగ్గొటి వేసుకొస్తాం అని, రుక్మిణి సమాధానం కోసం ఎదురు చూడకుండానే పదరా అని అడుగేశాడు.

భవానీ, చలం, ప్లాట్‌ఫారం చివరగావున్న స్టాల్‌కి బయలుదేరారు.

రాత్రి పదిగంటలు! స్టేషన్‌లో జనం అంతగా లేకపోయినా, రైలింజన్ల మోత, పోర్టర్ల కేకలతో, సద్దుమణుగుతున్న యుద్ధరంగంలా వుంది.

"నీకేం తక్కువరా వెధవా! కట్టుకుపోయ్యేంత ఆస్తి। వెనకా ముందూ బాదర బందీ గూడ ఏమీ లేదు. పిట, పిటలాడుతూ వయస్సులో వున్నావు?" భవానీ నిలదీశాడు.

చలం సమాధానం చెప్పలేదు, చెప్పలేక!

"రేయ్। నాకు తిక్కరేగితే మంచోణ్ణిగాను తెలిసిందా? నే అడిగిందానికి సమాధానం చెప్పు।" భవానీ కదల్లేదు।

కారణం యిదీ అంటె ఏం చెప్పనూ।" నసిగాడు చలం.

"మా మరదలుపిల్లను చేసుకుంటే ఎంత బాగుండేది. యిప్పుడది ఎలా వుందనుకున్నావ్. వళ్ళుచేసి చాలాబాగుంది. నాకే దాన్నిచూస్తే పళ్ళుపులుస్తున్నాయి।.... ఏవిటో నీఖర్మ ।"

"ఇప్పుడెక్కడుంది?" చాలా కుతూహలంగా అడిగాడు.

"కలకత్తా .... దాని మొగుడు షిప్పింగ్ కార్పొరేషన్‌గాదా .... దేశాలన్నీ తిరుగుతున్నారు ఝామ్మని।"

ఇద్దరూ టీ త్రాగారు

"నామాట విని రేయ్! పెళ్ళి చేసుకోరా! నువ్వు ఊఁ అంటే చూసుకో, మద్రాసులో వున్న టాప్‌స్టార్స్‌లో ఎవరన్నా దూకుతారు।"

చలం నవ్వాడు. "నన్ను చేసుకుని, వాళ్ళు సుఖపడగలరంటావా?"

భవానీ కొద్దిక్షణాలు ఆగి, ఆలోచించే చలం కళ్ళల్లోకి ఎక్సరే కళ్ళతో చూసి "నిజంగా నీకు సినిమాతారని చేసుకోవాలని వుందా?" అనడిగాడు.

"అదే ఆలోచిస్తున్నాను."

అది ప్రశ్న, సమాధానముతేల్చుకోలేక పోయాడు భవానీ।

"రేయ్। నీకు పలానారకం పిల్ల కావాలనిచెప్పు! నే నెతికి పెడతాను."

"ఉత్తరం వ్రాస్తా"

"ప్రామిస్"

"యస్। ప్రామిస్."

రైలొచ్చింది భవానీప్రసాద్ మద్రాసువెళ్ళాడు

చలం స్టేషన్‌లో వున్న సినిమా పోస్టర్ చూస్తు కూర్చున్నాడు.

హీరోయిన్ అందగత్తె। మాంచి అంగసౌష్టవం। అంతకుమించి ఆకర్షణ। పోనీ చేసుకుంటే ఆలోచించాడు చలం!

కార్లో ఇంటికివెళ్ళేప్పుడు గదిలో పడుకున్నప్పుడు ఆ తారే కళ్ళముందు మెదిలింది.

తేల్చుకోలేక పోయ్యాడు ఊహించుకోలేక పోయ్యాడు, తారమణితో, జీవితం!

డ్రైవర్ని పిల్చి అడిగాడు!

కరీం, నవ్వాడు. ఆ తర్వాత, "అది సినిమాలో చేరక ముందు పచ్చి లంజ సార్। దాని సంగతి మీకెందుకూ?" అని సలహాగూడ ఇచ్చాడు!

ఆ రాత్రి చలం నిద్రపోలేదు దూరపుకొండలు నునుపు తెరమీది సౌందర్యం, పాతివ్రత్యం, పత్రికల్లోపడే చిలక పలుకులు, అన్ని బూటకం! రేపు పొరపాటున పెళ్లయితే, కనబరిచే అభిమానం, చూపించే సోయిగాలు, పుట్టబోయే పిల్లలు, పంచుకునే జీవితం, అన్నీ నిజం కావు.

ఆ ఆలోచనకు స్వస్తిచెప్పాడు చలం !

కానీ తనింత కాలం ఎందుకు ఒంటరిగా వున్నాడు ? అదో పెద్ద ప్రశ్న ? అందరికీ—ఆఖరికీ చలానికి గూడ !

మీసాలు నల్లబడె వయస్సులో ఓ కలవారి పిల్లను చూశాడు చలం !

తెల్లటి బుగ్గలు, చాక్‌పీస్‌లా ముక్కు, గవ్వల్లాంటి కళ్ళు దానిమ్మ గింజల్లాంటి పళ్ళు, శంఖం లాంటి మెడ, పట్టు పరికిణీ కట్టుకుని, వాలుకన్నులతో, ముసిముసినవ్వులతో, చలాన్ని చూసింది.

చలం, ఆ అమ్మాయిని కన్నార్పకుండా చూశాడు పుత్తడిబొమ్మ . కన్న

వారింటికి, కట్టుకున్నవా రింటికి శోభతెచ్చే సౌందర్యం గుణం, సంపదా, సంస్కారం వున్నాయి.

చలం, ఆ సంబంధం వదులుకున్నాడు.

తల్లీ, తండ్రీ, ఆశ్చర్యపోయి, నిలవేసి, కాదూకూడదంటే చెప్పిన సమాధానం.... ఆ పిల్ల తల్లి జుట్టు నెరసి పోయింది ?

తండ్రి కాలంచేశాడు చలం, ఆస్తికి వారసుడయ్యాడు. తోటలు, దొడ్లు కాక, మద్రాసులో మేడ, విజయవాడలో రెండు డాబాలు, మూడు మల్టీ నేషనల్ కంపెనీలలో వాటాలు, ఓ బ్యాంక్ డైరెక్టర్ షిప్, వున్నా చలానికి, పిల్లని స్త్రామని ఎవరూ రాలా ?

చలం తల్లి, భర్త పొయ్యాడన్న దుఃఖం మర్చిపోయి, ఆఫీసు మేనేజరుని పిల్చి, విషయం ఆరాతీస్తే, "అమ్మా ! మీ తాహతుకు పిల్లనివ్వగల స్తోమత గలవాళ్లు, రాష్ట్రానికి ఒకరో ఇద్దరో వుంటారు. ఆ వున్న వాళ్ళకూ, పెళ్లిగాని ఆడపిల్లలంటూ వుంటేగదా తల్లీ, అబ్బాయి గారికి, పిల్లనిస్తామంటూ వచ్చేది?" అని వివరించాడు.

"డబ్బుతో, హోదాతో పని లేదు. పిల్ల బావుంటే, మాకు నచ్చితే చాలు, సంబంధాలు చూడండి !" అని చలం తల్లి ఉత్తర్వు ఇచ్చింది.

అమెరికాలో స్థిరపడి, ఇండియాలో పిల్లనివ్వాలనుకున్న సైంటిస్ట్‌గారి కూతురు, సంబంధం తెచ్చాడు మేనేజరు. సైంటిస్టుగారు, బొంబాయి వచ్చి, ఫైవ్ స్టార్ హోటల్‌లో పెళ్లి చూపులు ఏర్పాటు చేశాడు.

చలం, ఆ అమెరికా అమ్మాయి శైలూ, ఓ పగలు, కలసిరూంలో గడిపారు!

బ్రేక్ ఫాస్ట్, లంచ్, టీ, డిన్నరూ, అయ్యేంత వరకూ, చలం, శైలూ మట్లాడుకున్నారు. చూసుకున్నారు, ఒకర్నొకరు అర్థంచేసుకునేందుకు ప్రయత్నించారు!

చివరకూ ఆ సంబంధమూ కుదురలేదు.

కారణం ?

శైలూ, అనబడే శైలజకు తెలుగురాదు. అయినా ప్రస్తుతం నేర్చుకుంటున్నది ! చీరకట్టుకోటంరాదు ! తల్లి, అనగా చలం తల్లి, పెళ్లయ్యేలోగా నేర్పుతామన్నారు ! సరే ? కానీ — శైలూ తాగుతుంది, సిగరెట్లు, విస్కీ, బ్రాందీగూడ.

చలం వప్పుకోలేదు, ఆమెతో జీవితం పంచుకునేందుకు !

చలం తల్లీ పోయింది, కాన్సరొచ్చి ! కొడుక్కు పెళ్లి కాలేదన్న దిగులుతో !

చావబొయ్యే తల్లికిచ్చిన మాటకోసం, ఆతర్వాత, చలం, భవానీ మరదలు, రాధను చూశాడు.

రాధ సన్నగా మెరుపుతీగెలా వుంది. పచ్చటి పసిమి యమ్మెస్సీ ప్యాసయింది నవ్వితే మల్లెలు విచ్చుకున్నట్టు, వసంత కాలంలో చంద్రోదయమయినట్లు వుంటుంది. మాట్లాడితే, రెల్లుపొదలమధ్య పిల్లగాలి వీచినట్లు వుంటుంది.

భవానీ, ఆతని భార్య రుక్మిణి, ఆశపడ్డారు. పెళ్లి రంగ రంగ వైభోగంగా జరిపిస్తామని హామీయిచ్చాడు.

కానీ చలం అంగీకరించలేదు. రాధ పెళ్ళయ్యాక, భవానీ నిలదీసి, ప్రతిమి లాడితే చలం సమాధానం చెప్పక తప్పలేదు.

"మరీ సన్నగావుందిరా"

భవానీ క్షణం మాట్లాడలేదు. ఆ తర్వాత మొహం అంతా కందగడ్డలా చేసుకుని, "ఫూల్! నువ్వొత్త సినిక్ విరా! పెళ్ళయ్యాకగూడ అలాగే వుంట్రా ఆడాళ్ళు! అనగా వుండరురా వెధవా! రేయ్! ఇలా అయితే నీకీజన్మలో పెళ్ళి కాదు!" అని తిట్టాడు?

భవానీ కోపం, ఆపేక్షచూసి, చలం నవ్వుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి!

తెల్లారిందగ్గర్నుంచీ రాత్రి పడుకునేవరకూ చలానికి తీరిక వుండదు. టపాలు చూడటం. ఉత్తరాలమీద సంతకాలు, వచ్చేవాళ్ళు, ఫోన్‌కాల్స్. మీటింగులు. కాన్ఫరెన్స్‌లు, పార్టీలు, డిన్నర్లు ..., జీవితంలో క్షణంతీరిక వెసులుబాటులేదు.

ఈ మధ్యలో భవానీప్రసాద్ నాలుగుత్తరాలు వ్రాశాడు రెండుసార్లు ట్రంక్ కాల్స్‌చేశాడు. చలం ఉత్తరం వ్రాయలేదు తీరికలేక, వ్రాసేందుకువిషయాలు లేక !

పనుల గొడవల్లోనే, బెంగుళూరు వెడితే, అక్కడ విజయ పరిచయం అయ్యింది.

ఓ రోజు ఒంటరిగా రూంకి వచ్చింది!

విజయను చూస్తే చలం, మనస్సు చలించింది.

విజయ, అంత సన్నమూ కాదు, లావూలేదు, అలాఅని పొట్టీకాదు. చామన చాయరంగు బాబ్డ్ హెయిర్, మెళ్ళో సన్నటి బంగారు గొలుసు, నైట్‌గౌన్ లోంచి తొంగిచూసే, శరీరం వంపులు! ఎప్పుడు మత్తుగా మూసుకుపోయిన కళ్ళు. ఆ కళ్ళుతెరిస్తే కోరిక పడగ విప్పినట్లుంటుంది.

విజయతో, రెండురోజులు గడిపాడు! మబ్బుపట్టిన రాత్రి కబ్బన్ పార్క్‌లో, ఆమెవళ్లో తలెట్టుకు పడుకున్నాడుగూడా! యిద్దరూ మాట్లాడుకోక పోయినా, మౌనంలోనే, యిద్దరూ దగ్గరైనారు! చలంలో కోరిక తలెత్తింది. ఆ మారుటాకు వేసింది;

"పెళ్ళిచేసుకుందాం" అన్నాడు ఆమెను కౌగిలించుకున్న క్షణంలో।

విజయ నవ్వింది. చలం బుగ్గమీద చిటికవేసి, "నాటీబాయ్" అనిగోముగా; "నాకు పెళ్ళయింది" అంది.

ఆమాట, చలానికి, వీపుమీద అదాటుగా ఎవరో గుద్దినట్లుగా అయింది.

"మరి ఇలా తిరిగే ఖర్మేమిటి?" అనడిగాడు సాధ్యమైనంతవరకూ కోపాన్ని దిగమ్రింగుకుని.

గ్లాసులో, విస్కీపోస్తున్నట్లు. విజయ నవ్వింది. నవ్వి "ఫన్‌సేక్" అంది!

"అంతే?"

విజయ కాలిమీద కాలేసుకుని. సోఫాలో పడుకుని, సీలింగ్ వేపుచూస్తూ, "మా వారు ముసలిపీనుగ! నీలాగే డబ్బుంది, సుఖపడాలని వుంది, డబ్బుంటే అన్నిసుఖాలు అందుబాటులో వుంటాయన్న మొండితనంవుంది. అందుకే వరించినన్ను పెళ్లాడాడు" అనిచెప్పటం ఆపింది.

చలం ఆమెవేపే చూస్తూ, సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తు, గదంతా పొగతో నింపేశాడు!

"యింట్లో కడుపు నిండదు. అందుకే మైడియర్, యిలా నీలాంటివాళ్ళతో హానీమూన్ గడుపుతుంటా!"

"మీ మగడికి తెలుసా, నీ వోకళ్ళు"

విజయ నవ్వింది "సిల్లీఫెలో। ప్రతి మొగాడు తన పెళ్లాం పతివ్రత అనుకోకపోతే బ్రతకలేడు"

విజయ వెళ్ళినా చలానికి, ఆమెతోపొందిన అనుభూతి వదల్లేదు.

రెండు రోజులు ఏపని చూడకుండా, చెయ్యకుండా. ఆలోచిస్తూ, తనకు తారసపడ్డ ఆడవాళ్ళను గురించి, సింహావలోకనం చేసుకుంటూ గడిపాడు.

గడ్డంగీసుకోలేదు. డ్రస్ చేసుకోలేదు!

ఈ చిరుతిళ్ళతో కడుపు నిండదు! లాభంలేదు! వేరే ప్రయత్నం చేయడం మంచిదనుకున్నాడు చలం।

ఆ రోజు డ్రస్సింగ్ టేబుల్ముందు కూర్చుంటే, గడ్డంలో అక్కడక్కడ, తెల్లవెంట్రుకలు కనిపించాయి। కళ్ళ క్రింద చర్మం గట్టిపడి, చారలు ఏర్పడుతున్నట్లు అనిపించింది. చలానికి।

అలోచిస్తూ కూర్చున్నాడు చలం, "తనకు, వృద్ధాప్యం వస్తున్నదా?" అని.

అప్పుడే, వరండాలో డ్రైవరు, కుక్ మాటలు వినబడ్డాయి।

"అయ్యగారు దిగులుగా వున్నారేం"

ఏవుంది। ఒంటరి జీవితంగా।"

"పెళ్ళి చేసుకోవచ్చుగా।"

"సరేలే। నీకు తెలియదా...."

చలం చెవులు రిక్కించి విన్నాడు. అందరికి తన జీవితంగురించి తెలిసిన నిజ మేమిటాని!

విని, నిర్వీర్యుడై నాడు చలం!

విన్నవాడు "నిజమా! అదన్నమాట! అందుకే అయ్యగారికి ఇన్నేళ్ల బట్టీ పెళ్లిగాంది।" అని, వెళ్లిపోయాడు.

చలానికి, వాళ్ల సంభాషణ విన్నాక కాళ్లూ చేతులాడాలేదు! ఏం చెయ్యాలో తోచలేదు. బ్లడ్‌ప్రెషర్ తగ్గాక, భవానీకి ట్రంక్‌కాల్ బుక్ చేశాడు. ఆ కాల్ వచ్చేలోపల, కాలుకాలిన కోతిలా, తిరిగాడు, బంగళా అంతా!

"భవానీ। ఓరేయ్। తక్షణం నువ్వు వదినగారు ఓ పిల్లను చూడండి। లగ్నాలుకూడ పెట్టేసెయ్యండి। నే వచ్చి తాళి కట్టేస్తాను" అని పాఠం వప్పచెప్పినట్లు, చలం చెప్పేశాడు.

భవానీ క్షణం చలం ఏం చెప్పాడో అర్థంగాక, అర్థమయ్యాక వీడికి పెళ్లికెందుకింత తొందర యింత ఆర్థంతరంగా వచ్చిందో తెలియక, "సరెగానీ నీకు పిల్లనెతకటమంటే, మాటలా బాబూ! ఎన్ని చూడాలి" అన్నాడు.

"అంటే?" చలానికి తారాస్థాయికి కోపం వచ్చి, "నీక్కూడ, నేను మొగవాణ్ణి కాదేమొనన్న అనుమానం వుందా" అన్నాడు అని నాలిక్కరుచుకున్నాడు.

పుత్తడిబొమ్మ,

రాధ, శైలూ, విజయ

అందర్ని కాదన్న, చలం కోరికొక్కటే ఇప్పుడు "తను మొగాణ్ణి అని నిరూపించుకోవాలి। అని।

*